# ఖడ్గము మరియు సర్పము

## ఎల్. వెరె ఇల్లియట్

(1970 వ సంవత్సరం ప్రారంభంలో వెరె ఇల్లియట్ కు కలిగిన దర్శనం)



ఇది ఒక దర్శనం. నేను అమూల్యమైన ఆభరణములతో, రత్నములతో అలంకరించబడినగోడలు, రంగురంగుల గాజుతో చేయబడిన కిటికీలు కలిగిన ఒక గొప్ప సమావేశమందిరం (ప్రార్థనా మందిరం) మధ్యలో ఉంటిని.

ఆ మందిరం ప్రజలతో నిండియున్నది, వారిలో ధనవంతులు, పేదవారు, రోగగ్రస్తులు, వికలాంగులు, మూగవారు, గ్రుడ్డివారు వున్నారు. కానీ వారందరు సంకెళ్ళతో భందించబడి ఉన్నారు. ఒక్కరు కూడా భందించబడకుండా విడువబడలేదు (ఇది నేటి సంఘము వలే నున్నది. అందరూ సంఘ సభ్యులే గాని వారి వారి భందకములలో ఉన్నవారే).



ఆ మందిరమునకు ఎదురుగా ఒక వేదిక ఉన్నది. దానిపై ఒక ప్రక్క బలిపీటము మరియొక ప్రక్క ఒక పెద్ద పంజరము అందులో ఒక ఆకుపచ్చని సర్పము ఉన్నవి మరియు భోదకుడు నిలచియుండు స్థలము పైన ఒక గొప్ప ఖడ్గము రెండువైపుల త్రాళ్ళతో నేలకు సమాంతరముగ వ్రేలాడుచుండెను. ఆ వేదికపై అనేకమంది సేవకులు బహుషా 8 నుండి 10 మంది వరకు ఒకరి వెనుక ఒకరు ఒకరికంటె ఒకరు కొంచము ఎత్తులో కూర్చొని ఉండిరి.

అక్కడ చేరియున్న వారందరు వీరివైపు చూచుచుండిరి, వీరు మందిరమును పరికించుచుండిరి. ఒక ఉరుము వంటి ధ్వని ఆ బలిపీఠమునుండి వచ్చువరకు అక్కడ కొంత సమయము నిశ్శబ్దముగానున్నది. ఆ స్వరము " దేవుని వర్తమానమును ఎవరు ప్రకటిస్తారు?" అని దేవుని నుండి వచ్చినట్లుగా ధృఢంగా పలికింది.

మొదటి సేవకుడు ఒక పరిశుద్దగ్రంధమును చేతబట్టుకొని ప్రకటించుటకు ప్రయత్నించినతోడనే, ఆ ఆకుపచ్చటి వృద్దసర్పము ఒక్కసారిగా ముందుకు దూసుకువచ్చి మెరుస్తున్న కళ్ళతో తన భయంకరమైన కోరలను చూపుతూ ఆ సేవకుని పైకి శబ్దంచేస్తూ దూసుకు వచ్చేసరికి దైవజనుడు అని పిలవబడుచున్న ఆ వ్యక్తి భయంతో తన కుర్చీలో కూలబడి, తన చేతిలోని పరిశుద్దగ్రంధమును కుర్చీక్రింద దాచేసాడు. ఆ సర్పము తన తలతో ఆ ఖడ్గమును తాకి "ఎవరైనా దేవుని మాటకు విధేయులైనయెడల ఈ ఖడ్గంతో వారిని చంపేస్తా" నని ఆ వ్యక్తిని హెచ్చరించింది.

ఆ తరువాత కొంతసమయము నిశ్శబ్దముగా ఉంది. మరలా బలిపీఠమునుండి ఆ దైవస్వరము " దేవుని వర్తమానమును ఎవరు ప్రకటిస్తారు?" అని మరలా పలికింది. అప్పుడు సేవకుని వస్త్రధారణలో ఉన్న రెండవ వ్యక్తి లేచి నిలబడే సరికి, ఆ సర్పం అతని పైకి ఉరికేసరికి భయకంపితుడై తడబడి కూలబడి, పరిశుద్దగ్రంధమును కుర్చీక్రింద దాచేసాడు (దేవుని వాక్యాన్ని దాచడం). మరలా ఆ సర్పం ఆ ఖడ్గాన్ని తాకి మరలా "ఎవరైనా దేవుని మాటకు విధేయులైనయెడల ఈ ఖడ్గంతో వారిని చంపేస్తా" నని హెచ్చరించింది.

మూడవసారి బలిపీఠమునుండి దైవ స్వరం ఉరుమువంటి ధ్వనితో మరలా పలికింది. మూడవ వ్యక్తి కూడా లేవబోయి ముందు వారి వలెనే కూలబడ్డాడు. తిరిగి మరల మరలా ఆ స్వరం అక్కడ ఉన్న ప్రతి ఒక్క దైవజనుడు అని పిలువబడుచున్న వ్యక్తి ఆ మహా సర్పాన్ని ఎదిరించుటకు అవకాశము ఇవ్వబడునట్లుగా ఉరుము వంటి ధ్వనితో పలికింది. కానీ వారినందరిని భయము ఆవహించడం వలన ఎవ్వరూ ప్రకటించలేకపోయారు. ఆ మహా సర్పం దర్పంగా నవ్వింది.

"ఇక్కడ ఉన్న ప్రజలారా, ఇక్కడఉన్న ప్రజలారా, మీలో ఎవ్వరైతే నా వర్తమానాన్ని ప్రకటిస్తారో వారి సంకెళ్ళు తెగిపోయి వారు స్వేఛ్ఛాజీవులవుతారు. ఏ ఒక్కరూ లేరా?" అని దైవ స్వరం బలిపీఠము నుండి మరలా పలికింది.
అప్పుడు ఒక ఎన్నిక లేని వ్యక్తి (ప్రపంచం దృష్టిలో ఎందుకూ కొరగాని వ్యక్తి) ఆ బలిపీఠము పైకి ఎక్కి ఆ ఖడ్గము క్రింద నిలువబడి, ఆకాశము వైపు కన్నులెత్తి " దేవా నీ చేతికి నా ఆత్మను అప్పగిస్తున్నాను" అని పలికాడు. అప్పుడు పరిశుద్దగ్రంధమును తెరచి చదివాడు. అతడు దానికి ఏమీ కలుపలేదు, అందులోనుండి ఏమీ తీసివేయలేదు. అతడు వాక్యాన్ని చదివి, ఒక గొప్ప ఆధికృత కలిగిన వ్యక్తిలా మాట్లాడాడు.
కోపంతో ఆ మహాసర్పం, ఆ ఖడ్గాన్ని తాకి దానిని వ్రేలాడదీస్తున్న తాళ్ళలో ఒకదానిని, తెంపివేసింది. ఆ ఖడ్గం అతనిపైకి దూసుకు వచ్చింది గాని అతడు పొట్టి వ్యక్తి అగుట వలన అతనిని తాకకుండా అతని తలపై అటు ఇటు ఊగుతూ దాని బరువుకు రెండవ తాడు కూడా తెగిపోయి అక్కడ ఉన్న సేవకుల గుండెలగుండా దూసుకుపోయి వెనుక ఉన్న గోడలో దిగబడిపోయింది.



ఆ బలిపీఠము పైనుండి ఒక్క గొప్పమూల్గు ధ్వని వెలువడింది గాని అక్కడ చేరిన ప్రజలనుండి గొప్ప ఉత్సాహధ్వని వెలువడింది ఎందుకనగా వారి భందకాలు తెగిపోయి వారు స్వేఛ్ఛాజీవులై నారు (దేవుని మాట వలన వారు స్వతంత్రులైనారు).
ఈ దర్శనం ముగిసిన పిదప, రక్షకునియొక్క దర్శనాన్ని మేఘాలలో నా తలకు పైగా దర్శించాను. ఆయన ఇలా అన్నారు, " నా కుమారుడా, ఇప్పుడు జరిగిన సంగతుల భావాన్ని విను. నీవు చూచిన మందిరం ప్రపంచ క్రైస్తవ సంఘం, పైకి దైవ భక్తి కనబరుస్తూ, దేవుని శక్తిని ఆశ్రయించనిది. వారంతా లోకాశలనే నగలతో అలంకరించబడినవారు. వారికి వెండి, బంగారం పై ఉన్న దాహం ఎన్నటికీ తీరనిది. నీవు

చూసిన ప్రజలకొరకే నేను మరణించినది. కాని తెలివిలేకపోవుట వలన వారు నాశనంచేయబడ్డారు, వారికి చెవులున్నాయి గాని వారు వినలేరు. వారు నిజానికి భందకములలో ఉన్నారు, వారికి విడుదల కావాలి. సేవకులుగా పిలువబడుచున్న వారు కూర్చున్న ఆ వేదిక నరకము నుండి పుట్టిన మానవుని యొక్క చెడ్డతలంపులు. బలిపీఠము దేవుని సింహాసనము, ఆ మహా సర్పము ముసలి లూసిఫరే (సాతానే). ఖడ్గము దేవుని వాక్యము, దానిని వ్రేలాడదీస్తున్న త్రాళ్ళు మానవులకు జీవమునిచ్చు లేదా మానవుల జీవమును తీసివేయు వాక్య శక్తి. ఆ ఎన్నికలేని వ్యక్తికి జీవము ఇయ్యబడింది, దేవుని వాక్యాన్ని ప్రకటించనందున అక్కడి సేవకుల ప్రాణము తీసివేయబడింది. అక్కడ నీవు చూసిన సేవకులు ప్రతి సంఘములోనూ ఉండే (ఆడ లేదా మగ) నన్ను ఎరిగిన వారిగా నటించే వ్యక్తులే. వారు జీవ గ్రంధములో వ్రాయబడని వాటిని భోదిస్తారు. వారి గర్వము, లోకాశలు వారిని అబద్ధికుడును అబద్దాలకు జనకుడును అయిన సాతానుకు లోబడునట్లుగా చేస్తాయి. వారు అబద్దాలను, వ్యర్ధవాదనలను బట్టి ఒకరికంటే ఒకరు గొప్పవారిగా కనబడదానికి ప్రయత్నిస్తారు. మాటలను యధాథదంగా గుర్తిస్తారుగాని అందలి మర్మాలను గ్రహించలేరు. ఒక దినం వస్తుంది, అది బహు సమీపముగా ఉంది, - వీరివలెనే అట్టివారును నశించిపోతారు".

ఈ భయంకరమైన దృశ్యాన్ని గ్రహించినపిదప, ప్రభువు నాతో మరలా ఇలా మాట్లాడారు. " యిర్మియా 23 వ అధ్యాయములోని మరియూ యెహెజ్కేలు 34 వ అధ్యాయములోని ప్రవచనములు గుర్తుకున్నాయా? లేని యెడల చదువు", అని ఏసు నాతో చెప్పారు.

పరిశుద్దగ్రంధాన్ని తెరచి చదివాను. యెహోవా వాక్కు ఇదే- నా మందలో చేరిన గొఱ్ఱెలను నశింపజేయుచూ చెదరగొట్టు కాపరులకు శ్రమ. (యిర్మియా 23:1) ఈ ప్రవచనములలో ఒక భయంకరమైన విషయాన్ని నేను చూచాను. వారు వ్యభిచరిస్తూ పాపములో జీవిస్తూఉన్నారు (దేవుని మాటకు విరోధముగ), చెడుకార్యములు చేస్తున్నవారి హస్తములను బలపరస్తున్నారు. (యిర్మియా 23:14) ఏసు ప్రభువు చెప్పారు, "అంత్యదినములలో దీనిని గ్రహిస్తావు, తమ కడుపు నింపుకొను ఇశ్రాయేలీయుల కాపరులకు శ్రమ. కాపరులుగొఱ్ఱెలను మేపవలెనుగదా. (యెహెజ్కేలు 34:2) బలహీనమైన వాటిని మీరు బలపరచరు, రోగముగల వాటిని స్వస్తపరచరు, గాయపడినవాటికి కట్టుకట్టరు, తోలివేసిన

వాటిని మరలా తోలుకొని రారు, తప్పిపోయిన వాటిని వెదుకరు, అదిమాత్రమేగాక మీరు కఠినమనస్కులై బలాత్కారముతోవాటిని ఏలుదురు.(యెహెజ్కేలు 34:4). తప్పిపోయిన దానిని నేను వెదుకుదును, తోలివేసినదానిని మరలా తోలుకొని వచ్చెదను, గాయపడినదానికి కట్టు కట్టుదును, దుర్బలముగా ఉన్నదానిని బలపరచుదును, అయితే క్రొవ్వినవాటికిని, బలముగలవాటికిని శిక్షయను మేతపెట్టి లయపరచెదను (యెహెజ్కేలు 34:16). అప్పుడు ఆయన ఇలా చెప్పారు, "దొంగ కాపరులు తమపైకి వచ్చు ఖడ్గమును తప్పించుకొనలేరు. కాని నా గొఱ్ఱెలు హెచ్చరించబడాలి, అవి విడుదల చేయబడాలి". మరలా ఇలా చెప్పారు, "యిర్మియా 25 వ అధ్యాయం చివరిభాగంలోని ప్రవచనం గుర్తుకు ఉందా? లేని యెడల చదువు".

వాటిని నేను చదివాను. ఆ దినమున యెహోవా చేత హతులైనవారు ఈ దేశముయొక్క ఈ దిశనుండి ఆ దిశవరకు కనబడుదురు, ఎవరును వారిని గూర్చి అంగలార్చరు, వారిని సమకూర్చరు, పాతిపెట్టరు, పెంటవలె వారి శవములు నేలమీద పడియుండును (యిర్మియా 25:33). కాపరులారా అంగలార్చండి, మీ వధ దినం సమీపించింది. అప్పుడు ఆయన చెప్పారు, "ఈ దినములు త్వరగా వస్తాయి, కాపరులు అంగలారుస్తారు, ఆ దినము యేడ్పులు, పండ్లుకొరుకుటయు ఉండును. అక్కడ నీవు చూచిన ఆ యెన్నిక లేని వ్యక్తి, తమ్ముతాము తగ్గించుకొని, దేవునియందు నమ్మికయుంచి, శిలువ మరణమునొందునంతగా విధేయతచూపుచు, సర్వలోకమునకు దైవ సువార్తను ప్రకటించువారు (ఆడవారు గాని మగవారు గాని) అట్టి వ్యక్తిని నీవుకనుగొన్నపుడు, అతని వివరములను నాకు తెలియజేయి. అట్టివ్యక్తితో నేను భూమిని ఆకాశాన్ని కంపింపచేస్తాను". అని ప్రభువు చెప్పారు.

Translated to Telugu by T.J.H.Prasad Babu, prasadbabutjh@gmail.com